సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025





## జాగ్రత్తలతోనే ఆనంద కేళీ..!

దీపావళి పండగ సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదు.

- IIలో



## ప'రేషన్'..!

నెల ముగుస్తున్నా ఇంకా చాలామందికి రేషన్ బియ్యం అందడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

- IIలో

## టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

సారవకోట: గొర్రిబంద పంచాయతీ అగుతువురంలో మినీ గోకులం షెడ్ నిర్మాణం బిల్లు మంజూరులో జరిగిన అవకతవకలకు సంబంధించి ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ పి.దామోదర్‌ను డ్వామా పీడీ సుధాకరరావు సస్పెండ్ చేయడంతో పాటు రూ.10 వేలు అపరాధ రుసుం విధించారని ఏపీఓ నారాయణ శనివారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ సరస్వతికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

## న్యూస్‌రీల్

### వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ అనిత

వజ్రపుకొత్తూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందిచాలని, ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విమల హెచ్చరించారు. శనివారం వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను, మందులు భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కుపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి ఎస్.మహరాజ్, సూపర్‌వైజర్ చక్రధరరావు, సీహెచ్ఓ సీహెచ్.ఈశ్వరమ్మ, స్టాఫ్‌నర్సు ఎస్.జ్యోతికుమారి, ఫార్మసిస్ట్ ఎ.సంతోషి పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీముఖలింగంలో బాలి దీక్షలు

జలుమూరు: శ్రీముఖలింగంలో ఆదివారం నుంచి నవంబరు తొమ్మిది వరకు బాలి దీక్షలు ప్రారంభం కానున్నాయని నిర్వాహక కమిటీ ప్రతినిధి దువ్వాడ జీవితేశ్వరరావు శనివారం తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజు నుంచి కార్తీకమాసం ఆఖరి వరకూ బాలియాత్ర, దీపోత్సవం తదితర కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. బాలిదీక్షల్లో భాగంగా 21 రోజులు తెల్ల పంచె, తెల్ల చొక్కా, కాషాయి కండువా ధరించి నిష్టతో మెలగాలన్నారు. నవంబరు 9న స్వామి సన్నిధిలో దీక్ష విరమణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు శ్రీముఖలింగం అర్చక స్వాములను సంప్రదించాలని కోరారు.

### కొండచిలువ హల్‌చల్

సోంపేట : బారువ బీల పొలంలో శనివారం తొమ్మిది అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. ఆందోళనకు గురైన స్థానిక రైతులు కర్రలతో కొట్టి హతమార్చారు.



హతమైన కొండచిలువ

### ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హిరమండలం: వంశధార నది ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఐదు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ జోగారావు, ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# అక్షరంపై ఎందుకంత కక్ష..?

- 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై సర్కారు వేధింపులను ఖండించిన ప్రజాసంఘాలు, జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు

'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని, ఇతర రిపోర్టర్లను తరచూ వేధించడాన్ని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రభుత్వ పాలనలో లోపాలు ఎత్తిచూపే పత్రికలను ఇబ్బందులకు గురిచేసేలా కేసులు బనాయించడాన్ని తప్పుపడుతున్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల గొంతునొక్కే తీరు మార్చుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- శ్రీకాకుళం పాతబస్టాండ్/నరసన్నపేట/ఆమదాలవలస /శ్రీకాకుళం పీఎన్‌కాలనీ



### పత్రికా స్వేచ్ఛ హరించడమే..

ప్రజల గొంతుకగా నిలిచే పత్రికలపై వేధింపులు స్వేచ్ఛను హరించడమే. కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై విషం చిమ్ముతోంది. నకిలీ మద్యం దందాను వెలుగులోకి తీసుకొచ్చినందుకు మీడియాపై ఆంక్షలు, ఎడిటర్, విలేకరులపై కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం. పత్రికా స్వేచ్ఛను హరించేలా పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.

– పిట్టా దామోదరరావు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



### తప్పుడు కేసులు..

ఇష్టానుసారంగా కేసులు నమోదు, విచారణ పేరుతో రాష్ట్ర పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్న తీరును హైకోర్టు తప్పుపడుతున్నా.. పోలీసులు తీరులో మార్పు రాకపోవడం శోచనీయం. ఇదే తరహాలో సాక్షి ఎడిటర్‌పైన, వార్తలు రాసే విలేకర్లపైన కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛకు తూట్లు పొడవటమే. గతంలో ఎప్పుడూ ఈ విధమైన సంస్కృతి లేదు.

– కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్



### ప్రజాస్వామ్యంపై దాడి..

జర్నలిస్టులకు వేధింపులు ప్రజాస్వామ్యంపై దాడే. పత్రికలు, ఎడిటర్‌పై కేసులు బనాయించడం సరికాదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పాలకులు వ్యవహరిస్తున్న తీరు గర్హనీయం.

– బొడ్డేపల్లి మోహనరావు, ఏపీసీఎల్ సంయుక్త కార్యదర్శి



### వాస్తవాలు తట్టుకోలేకే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించింది. అకారణంగా సోదాలు చేపట్టింది. ఇప్పుడు అక్రమ కేసులు బనాయిస్తోంది. నకిలీ మద్యంకు సంబంధించి ప్రజల పక్షాన ఉంటూ వార్తలు ప్రచురిస్తుంటే తట్టుకోలేక ఎడిటర్ ధనంజయరెడ్డిపై, ఇతర విలేకర్లపై కేసులు పెట్టి విచారణ పేరున ఇబ్బందులకు గురి చేయడాన్ని పత్రికా స్వేచ్ఛపై దాడిగానే పరిగణించాలి. ప్రతిఒక్కరూ దీనిని ఖండించాలి. సాక్షికి మద్దతుగా నిలవాలి.

– కనపల శేఖరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి



### ప్రజల గొంతుకగా..

ప్రజా పక్షాన నిలబడి నిజాన్ని నిర్భయంగా చెప్పేది సాక్షి పత్రిక ఒక్కటే. కూటమి అరాచకాల్ని ప్రజలకు తెలియజేస్తుంటే వాటిని చూసి తట్టుకోలేక సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఇలాంటి కేసులు, బెదిరింపులకు ఎక్కడా సడలకుండా మరో పదడుగులు ముందుకేసి నిజాల్ని రాసే వ్యక్తి ధనంజయరెడ్డి.

– ఎం.వి.స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



### ఇదేం తీరు...

ప్రభుత్వంలో అక్రమాలను వెలికితీస్తున్న జర్నలిస్టులు చేస్తున్న కృషిని అడ్డుకోవడం, వారి గొంతు నొక్కడం సరికాదు. ప్రజాస్వామ్యంలో విలువలతో కూడుకున్న వ్యవస్థ పత్రికా వ్యవస్థ. దాన్ని రూపు మాపేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రాకూడదు. హక్కులు హరించే వైఖరి మానుకోవాలి.

– బొడ్డేపల్లి జనార్దనరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు

# డేంజర్ జోన్

- శ్రీకాకుళం నగర పరిధిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఆర్టీసీ బస్సులు ఢీకొని ఇటీవల నలుగురు మృత్యువాత



బస్సు, డివైడర్ మధ్య మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్:

పేరుకే జిల్లాకేంద్రం.. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణలో గానీ.. రోడ్ల రూపకల్పనలో గానీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గడిచిన కొద్ది రోజులుగా శ్రీకాకుళం నగరంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. తాజాగా శనివారం ఉదయం నాటి సంఘటనలో నగరానికే చెందిన వృద్ధుడైన బిల్డర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

### మార్జిన్లు పెంచాల్సిందే..

ఈ ఘటన చూశాకైనా నగరంలోని కీలక రద్దీ కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ మార్జిన్‌లు పెంచాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా తోపుడు బళ్లు, పెద్ద వాహనాలు, నోపార్కింగ్‌లో ఉండే వాహనాలు, ఎక్కడపడితే అక్కడ ఆపే ఆటోలను నియంత్రించాలని, సిగ్నల్ పాయింట్లు మరమ్మతులకు గురి కాకుండా చూడాలని, ప్రమాద పాయింట్లలో ఆటోమెటిక్ స్పీడ్‌బ్రేకర్లు, రేడియం స్ట్రిప్పర్లు వేయించి ట్రాఫిక్ బీట్ వ్యవస్థ నిఘా పూర్తిగా ఉండేటట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### తరచూ ప్రమాదాలు..

- గత నెల 4న టెక్కలి నుంచి విశాఖ వెళ్తున్న బస్సు ఆర్టీసీ కాంప్లెక్సు లోపలికి వెళ్తూ పాదచారుడైన రాజాం మండలానికి చెందిన గునుపూరి శంకర్రావును ఢీకొట్టింది. వెనక చక్రాలు కింద పడటంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. విశాఖలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- ఇదే ఏడాది డే అండ్‌నైట్ బ్రిడ్జివద్ద గర్భిణి తన భర్తతో వెళ్తుండగా వెనుకగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రాణాలొదిలింది. ఘటనాస్థలి వద్ద ఆగకుండా బస్సును పట్టుకుని డ్రైవర్ విశాఖ వరకు వెళ్లిపోగా సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు తెలుసుకుని రప్పించారు.
- కొన్నాళ్ల క్రితం ఆమదాలవలసకు చెందిన ఓ హోంగార్డు నైట్‌బీట్ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై నగరానికి వచ్చి తిరుగుపయనమయ్యాడు. సరిగ్గా ఆదివారంపేట వచ్చేసరికి వెనుకగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.



### వినేవారే లేరు..

డే అండ్ నైట్, సరస్వతీ థియేటర్, రామలక్ష్మణ, ఏడురోడ్ల కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ కోసం పది అడుగులకు మించి మార్జిన్ లేదు. జంక్షన్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు కోసం గ్రీవెన్సులలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు పెడుతున్నా ఫలితం లేదు. రోడ్లను విస్తరించాలి. వాహనదారులకు పార్కింగ్ సౌలభ్యం చూపించాలి.

– బి.వి.రవిశంకర్, రిటైర్డ్ అధికారి

### కేసులు కట్టక..


ఐదు రోజుల క్రితం డే అండ్‌నైట్ బ్రిడ్జిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టగా ఒకరి కాళ్లు విరిగిపోయాయి. కేసు నమోదు చేయలేదు. నందల వీధిలో కూడా ఇదే తరహాలో ఘోర ప్రమాదం జరిగినా కేసు లేదు. గత నెల 12న ఉమెన్స్ కాలేజీ రోడ్డులో నడుస్తున్న యువకున్ని ద్విచక్రవాహనదారులు ఢీకొట్టగా రిమ్స్‌కు వెళ్లకుండా ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. యువకునికి కాలు విరిగింది.

### వాకింగ్‌కు వెళ్లి వస్తూ..

- స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధుడు మృతి
- శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్‌లో ఘటన

శ్రీకాకుళం క్రైమ్: స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. శనివారం జిల్లాకేంద్రంలో జరిగిన ఈ ఘటన స్థానికులను కలచివేసింది. స్థానిక రాధాకృష్ణనగర్‌కు చెందిన బిల్డర్ వంకదార సత్యనారాయణ (64) రోజూలాగే శనివారం ఉదయం స్కూటీ వేసుకుని ఆర్ట్స్ కళాశాల వాకింగ్‌కు బయల్దేరాడు. సహచరులతో వాకింగ్ చేసి తిరిగి ఇంటికి బయల్దేరాడు. సరిగ్గా 7.30 గంటలకు అంబేడ్కర్ కూడలి నుంచి డేఅండ్‌నైట్ వైపుగా పూర్తిగా రైట్‌లోకి తిరిగాడు. అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో డివైడర్‌కు, బస్సుకు మధ్య గ్యాప్ తక్కువగా ఉండటంతో ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో బస్సు వెనకచక్రం తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సత్యనారాయణ భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందారు. ఇద్దరి కుమారుల్లో ఒకరు హైదరాబాద్‌లో ఉండగా మరో కుమారుడు బిల్డర్‌గా కొనసాగుతున్నాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అప్పలరాజు పేర్కొన్నారు.





మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు, (ఇన్‌సెట్లో) వి.సత్యనారాయణ (ఫైల్)

## పాములు వద్దు.. పాఠశాల ముద్దు

- పాములు పట్టేందుకు వెళుతున్న పిల్లల్ని గమనించిన ఎంఈఓ, హెచ్ఎం
- తల్లిదండ్రులను ఒప్పించి బడిలో చేర్పించిన వైనం



పాఠశాలలో చేరిన రాఘవకు విద్యార్థి కిట్ అందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కంచిలి : ఇటీవల కంచిలి మండలం చొట్రాయిపురం పాఠశాలకు సందర్శనకు వచ్చిన ఎంఈఓ ఎస్.శివరాంప్రసాద్‌కు.. పాములు పట్టేందుకు వెళుతున్న రాఘవ అనే బడిఈడు పిల్లాడు కనిపించాడు. వెంటనే ప్రధానోపాధ్యాయుడు మద్దు తిరుపతిరావుతో కలిసి బాలుడి తల్లిదండ్రులు గురించి వాకబు చేశారు. అక్కడ సమీపంలో కొండపై నివసిస్తూ పాములు పట్టుకొని జీవనోపాధి సాగిస్తున్న దంపతులు చెరుకూరి రమేష్, లక్ష్మీల వద్దకు వెళ్లారు. వారి పిల్లలు రాఘవ, దీప్తిలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని చెప్పి ఒప్పించారు. దీంతో వారు తమ ఇద్దరు పిల్లలను శనివారం పాఠశాలకు తీసుకొచ్చారు. అబ్బాయి రాఘవను ప్రాథమిక పాఠశాలలో, బాలిక దీప్తిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యారడి దీనబంధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్ట్రెచ్చర్.. ఇలాకూడా వాడతారా!



ఆస్పత్రుల వద్ద సాధారణంగా స్ట్రెచ్చర్‌ను నడవలేని స్థితిలో ఉన్న రోగులను, ప్రమాదాలకు గురైన బాధితులను తీసుకెళ్లేందుకు ఉపయోగిస్తారు. అయితే టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం మట్టిని తరలించేందుకు వాడుతున్నారు. శనివారం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న సమయంలో స్ట్రెచ్చర్‌పైనే మట్టిని తీసుకొచ్చారు. అత్యవసర సమయాల్లో స్ట్రెచ్చర్లు లేవని చెబుతున్న సిబ్బంది ఇలా మట్టిని తరలించేందుకు వినియోగించడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. – టెక్కలి రూరల్

## మదినిండుగ.. వెలుగుల పండుగ..



దీపావళి పండుగ ముందస్తు సంబరాలను శనివారం చిన్నారులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. బాణసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. జిల్లా కేంద్రంలోని మండలవీధి రవీంద్రభారతి పాఠశాల ఈ సంబరాలకు వేదికగా నిలిచింది.

– శ్రీకాకుళం

## క్లుప్తంగా

### అమోనియా కంటైనర్ బోల్తా



బోల్తాపడిన కంటైనర్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని జర్జంగి గ్రామ సమీప జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒక భారీ కంటైనర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి శ్రీకాకుళం వైపు అమోనియా లోడ్‌తో వెళ్తున్న భారీ కంటైనర్ జర్జంగి గ్రామ సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

### జిల్లాను స్వచ్ఛంగా మార్చుదాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



చెత్తను డస్ట్‌బిన్‌లో వేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి: రాష్ట్రంలో మన జిల్లాను స్వచ్ఛంగా మార్చుకుందామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మూడో శనివారం పురస్కరించుకొని వాయు కాలుష్య నివారణ థీమ్‌తో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అరసవల్లి ఇంద్ర పుష్కరిణి వెనుక భాగంలో కాజీపేట కూడలి వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకర సమాజాన్ని రూపొందించవచ్చన్నారు. అనంతరం కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకరరావు, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, అరసవల్లి ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### అవన్నీ తప్పుడు ఆరోపణలు

- ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: ఇటీవల కొన్ని పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్త కథనాలు పూర్తి అవాస్తవమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తనకు ఎటువంటి గ్యాంగ్‌లు లేవని, తన బలం ప్రజలేనని తెలిపారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మవద్దని కోరారు. కొంతమంది వ్యక్తులు బాధితులను ఉసిగొల్పి తప్పుడు ఆరోపణలు చేయించారన్నారు. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వార్తలు ప్రచురించే ముందు ధ్రువీకరించుకోవాలని మీడియా ప్రతినిధులకు సూచించారు.

## దీపావళి

# జాగ్రత్తలతోనే ఆనంద కేళీ..!



- ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు
- 21 ఏళ్ల క్రితం జిల్లాలో భారీ విషాదం
- జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సూచనలు

శ్రీకాకుళం క్రైమ్:

దీపావళి అంటే పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఆనందంగా జరుపుకునే పండగ. ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుకుంటూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. అయితే దీపావళి ఆనందంగా జరుపుకోవాలంటే జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం, అలసత్వం వహించినా ఆస్తి, ప్రాణ నష్టం జరిగి విషాదం మిగులుతుంది. అలాంటి చీకటి రోజును జిల్లా 21 ఏళ్ల క్రితం చూసింది. 2004వ సంవత్సరం నవంబర్ 4వ తేదీన జిల్లా కేంద్రంలో చిన బజారులోని ఒక నివాస గృహం గ్రౌండ్ ఫ్లోర్‌లో అక్రమ పేలుడు పదార్థాల నిల్వలు పేలడంతో ఘటనా స్థలంలో 8 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృత్యువాత పడ్డారు. ఆనాటి ఘటన తలచుకుంటే ఇప్పటికీ జిల్లా ప్రజలకు ఒళ్లు గగుర్పొడుస్తుంది. పేలుళ్ల జరిగిన మరుసటి రోజు జరిగిన ప్రాంతమంతా క్లీన్ చేశారు. ఆ మరుసటి రోజు నిల్వల డంప్ అంతా (కాలిపోయినవే అని) డే అండ్ నైట్ సమీప నాగావళి నది వద్ద పారబోసేందుకు వ్యాన్‌లో వెళ్లారు. ప్రమాదవశాత్తు అక్కడ కూడా ఆ చెత్తలో కొన్ని పేలుడు పదార్థాలు పేలడంతో అక్కడికక్కడే డ్రైవర్, క్లీనర్, మరో హెల్పర్ మృత్యువాత పడ్డారు.

**నువ్వలరేవులో సైతం..**

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో దాదాపు 25 ఏళ్ల క్రితం శ్రీరామనవమి ఉత్సవాల్లో బాణాసంచా పేల్చేందుకు కొందరు అక్రమంగా భారీ ఎత్తున పేలుడు పదార్థాలు నిల్వలు ఉంచారు. ప్రమాదవశాత్తు అవి కూడా పేలడంతో అప్పట్లో అధిక సంఖ్యలో మృత్యువాత పడినా.. నలుగురైదుగురే చనిపోయినట్లు రికార్డులకెక్కించారు. మృతదేహాలను సమీప ఇసుక దిబ్బల్లో పాతివేసినట్లు ఇప్పటికీ ఆ ప్రాంతంలో ప్రచారం జరుగుతూనే ఉంటుంది. ఈ ఘటనకు సంబంధించి అప్పటి ఎస్‌ఐ కృష్ణ సస్పెండయ్యారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నాణ్యమైన కంపెనీలు తయారు చేసిన బాణసంచాను వినియోగించాలి.
- వేగంగా కాలే స్వభావం ఉన్నవి ఇళ్లల్లో నిల్వ ఉంచరాదు.
- కిరోసిన్, గ్యాస్ నిల్వ చేసే గదుల్లో, వంట గదుల్లో బాణసంచా ఉంచరాదు.
- చిన్నపిల్లలను దూరంగా ఉంచాలి.
- కాల్చేటప్పుడు పొడుగాటి కర్రకు కాకర్లు, వగైరా కట్టి కాల్చాలి.
- చేతిలో గానీ, దగ్గరలో గానీ బాం బులు కాల్చకూడదు.
- సగం కాలిన మందుగుండుని నిర్లక్ష్యం చేయరాదు.
- బాణసంచా కాల్చేటప్పుడు సమీపంలో నీళ్లు, ఇసుక ఉంచుకోవాలి.
- బిగుతుగా ఉండే దుస్తులు ధరించాలి.
- రోగులు, వృద్ధులు, పసిపిల్లలు, గర్భిణులు దూరంగా ఉండాలి.
- రాకెట్లు, ఫైర్ క్రాకర్లు వంటి క్షిపణులను టిన్ బాటిళ్లలో పెట్టి వెలిగించకూడదు.
- గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బంకులకు దూరంగా రాకెట్లను, పటాకులు కాల్చాలి.
- అగ్నిప్రమాదం సంభవిస్తే తక్షణమే దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రం లేదా 101కి ఫోన్ ద్వారా సమాచారమివ్వాలి.

### జాగ్రత్తలు తీసుకోవాలి



తాత్కాలిక షాపులకు లైసెన్సులను ఆయా పరిధి ఆర్డీవోనే అందజేస్తారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, పంచాయతీ (లేదా) వార్డు అన్ని అనుమతులు అందులోనే ఉంటాయి. క్వాలిటీ అయినవి, నిబంధనలకు అనుగుణంగా ఉన్నవి కాల్చి జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

– జడ్డు మోహనరావు, జిల్లా అగ్నిమాపక అధికారి

### విక్రయాలు జరపరాదు



అక్రమంగా మందుగుండు సామాగ్రి తయారు చేసినా, నిల్వలు కలిగి ఉన్నా, అమ్మినా కఠిన చర్యలు తప్పవు. లైసెన్సులు లేకుండా మందుగుండు అమ్మితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే దాడులు చేస్తున్నాం. ఎవరైనా లైసెన్సులు లేకుండా అమ్మినా నేరుగా ప్రజలు సమాచారమివ్వవచ్చు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో మరిన్ని జాగ్రత్తలు వహించి ప్రజలు దీపావళి జరుపుకోవాలి.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

# మోసం చంద్రబాబు నైజం



కరవంజలో మాట్లాడుతున్న కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. మండలంలోని కరవంజ – టెక్కలిపాడు క్లస్టర్ సమావేశంలో శనివారం మాట్లాడారు. పేదలకు వైద్యం దూరం చేయడమే చంద్రబాబు ధ్యేయమన్నారు. అందుకు మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నాడన్నారు. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాలు కార్యక్రమం తలపెట్టామని తెలియజేశారు. అన్నమయ్య జిల్లాలోని మునకల చెరువుతో పాటు నరసన్నపేట నియోజకవర్గంలో బుడితి వద్ద అవలింగి గ్రామంలో మినీ పరిశ్రమ పెట్టి టీడీపీ నాయకులు మద్యం కల్తీ చేస్తున్నారని మండిపడ్డారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే రమణమూర్తిదే సిండికేట్ అని, వారి కుటుంబ సభ్యుల పేరిట మద్యం షాపులు ఉన్నాయని వివరించారు. అవలింగిలో కల్తీ జరిగిన మద్యం పట్టుకున్న అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరించాలన్నారు. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, రైతు పండించిన పంటలకు మద్దతు ధర లేదని మండిపడ్డారు. అనంతరం డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించి, కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా కార్యదర్శి ఎం.శ్యామలరావు, సర్పంచ్ జుత్తు నేతాజీ, గొల్లంగి జగన్నాథరావు, జిల్లా బూత్ లెవెల్ అధ్యక్షుడు దామ మన్మథరావు, రకావాడ చందనబాబు, ధర్మాన జగన్, ధర్మాన బువాజీ, తర్ర జీవరత్నం, కె.కూర్మారావు, బండి ఎర్రన్న, బలగ లక్ష్మీ, అర్జున్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులెలా ఇచ్చారు..?

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి: జనావాసాలు, విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలకు ఎలా అనుమతులిచ్చారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ టెక్కలి అగ్నిమాపక అధికారి సూర్యారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్కలిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల పరిశీలన కోసం విచ్చేసిన ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పరిశీలన, స్థానిక అభ్యంతరాలు చూడకుండా కేవలం పత్రాలు చూసి అనుమతులు ఇచ్చారా అని నిలదీశారు. తక్షణమే అభ్యంతరకంగా ఉన్న దుకాణాన్ని మార్పు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ బి.సత్యం, డీఎల్‌పీవో ఐ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా మందుగుండు నిల్వలు సీజ్



సారవకోట: స్వాధీనం చేసుకున్న బాణసంచా, తయారీ వస్తువులు

కంచిలి: మండలంలో అనుమతి పొందిన నాలుగు మందుగుండు దుకాణాల్లో అధిక మొత్తంలో టపాసులు నిల్వలు ఉన్నాయనే కారణంతో పోలీసులు ఆ సరుకును సీజ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు. కంచిలిలో బలియాపుట్టుగ వద్ద తెల్లి వైకుంఠరావుకు చెందిన రూ.2,69,470ల సరుకు, అంపురం వద్ద సుంకర మణికంఠకు చెందిన రూ.1,71,900ల సరుకు, జాడుపూడిలో దూపాన సునీల్‌కు చెందిన రూ.1,16,497లు విలువ కలిగిన సరకు, అదే గ్రామంలో దూపాన శ్రీనివాసరెడ్డికి చెందిన రూ.1,15,300లు విలువ గల సరకును సీజ్ చేసినట్లు వెల్లడించారు.

సారవకోట: మండలంలోని కొమ్ముసరియాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రూ.50 వేలు విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన పైల సుశీల, లుకలాపు తిరుపతిరావు బాణసంచాతో పాటు బాణసంచా తయారు చేయడానికి కావాల్సిన ముడి సరుకులు కలిగి ఉండడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారి ఇళ్లపై దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాణసంచాను సారవకోట పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. దీంట్లో పైల సుశీల వద్ద నుంచి రూ.30 వేలు విలువ కలిగిన బాణసంచా, లుకలాపు తిరుపతిరావు నుంచి రూ.20 వేలు విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశారు.

### మధ్యాహ్న భోజనం అపహాస్యం



చారు లేకుండానే అన్నం తింటున్న విద్యార్థులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహాసింగిగూడ ఆర్‌ఆర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అపహాస్యం చేసేవిధంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. 18 మంది పిల్లలకు పాఠశాల ఆవరణలో వంట చేయడం లేదు. ఇంటి వద్ద వంట చేసి పాఠశాలకు వంట ఏజెన్సీ సభ్యురాలికి బదులు ఆమె భర్త ప్రతిరోజూ తీసుకొచ్చి విద్యార్థులకు వడ్డన చేస్తుంటారు. శనివారం మధ్యాహ్నం భోజనాన్ని పాఠశాలలో కేవలం నలుగు విద్యార్థులు మాత్రమే చేశారు. అయితే నలుగు విద్యార్థులకు కేవలం అన్నం, కూర పెట్టారు తప్ప, చారు మాత్రము తీసుకు రాలేదు. చారులేక పోవడంతో విద్యార్థులు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. మిగిలిన 14 మంది విద్యార్థులు గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి హాజరైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల వద్ద గదులు సక్రమంగా లేకపోవడం వలన ఇంటి వద్ద వంట చేయిస్తున్నట్లు చెప్పారు.

# పరేషన్..!


- రేషన్ కార్డుదారులకు అందని బియ్యం
- లబ్ధిదారుల్లో ఆందోళన



చల్లవానిపేట రేషన్ డిపో

జలుమూరు:

అక్టోబర్ నెలకు సంబంధించి నిత్యావసర సరుకుల దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యం తక్కువగా రావడంతో రేషన్ బియ్యం అందక వందల సంఖ్యలో లబ్ధిదారులు నష్టపోయారు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న వే బ్రిడ్జి పాడైపోవడంతో బియ్యం బ్యాగుల్లో నాలుగు కేజీల వరకూ తరుగుతో తూకం వేయడం వలనే ఈ సమస్య వచ్చిందని డీలర్లు చెబుతున్నారు. దీంతో రేషన్ కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యం సరిపోలేదు. ఫలితంగా రేషన్ దుకాణాల్లో బియ్యం లేకపోవడంతో డీలర్లు లబ్ధిదారులను తిప్పి పంపారు. మండలవ్యాప్తంగా 53 రేషన్ డిపోలకు 18,583 రేషన్ కార్డులు ఉన్నాయి. దీనికి సంబంధించి 450 టన్నుల బియ్యం రావడంతో వాటిని ఆయా డీలర్లకు పంపించడం జరిగిందని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు తెలిపారు. ఇంతవరకూ బాగున్నా ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వే బ్రిడ్జి పాడైపోవడంతో బస్తాల్లో రెండు నుంచి నాలుగు కేజీల వరకూ తరుగు వస్తోందని దీనివల్ల అర్హులైన లబ్ధిదారులు నష్టపోతున్నారని సీఎస్‌డీటీ షరీఫ్ చెబుతున్నారు. వీటితోపాటు కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం ఇవ్వాలని నిబంధన ఉన్నా.. వాటికి సంబంధించిన అలాట్మెంట్ పౌర సరఫరా అధికారులు ఇవ్వకపోవడంతో బియ్యం సరిపోలేదని డీలర్లు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈనెల బియ్యం 955 కార్డుదారులకు ఇంకా అందలేదు. దీనిపై సీఎస్‌డీటీ షరీఫ్ మాట్లాడుతూ ఎవరెవరికి బియ్యం అందలేదో ఆయా డీలర్ల ద్వారా అడిగి వారికి బియ్యం అందేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న వే బ్రిడ్జి

### ఈనెల బియ్యం ఇవ్వలేదు



నాకు ఈనెల బియ్యం ఇంకా ఇవ్వలేదు. అలాగే ఇంటికి వచ్చి వేలిముద్రలు తీసుకుంటామన్నారు. డీలర్లను అడితే పక్క గ్రామం వెళ్లమన్నారు. ఇదెక్కడ న్యాయం. నేను 75 ఏళ్ల ముసలిదానిని. నేను కిలోమీటర్ల దూరం ఎలా వెళ్లగలను. అధికారులు స్పందించి నా బియ్యం నాకు ఇప్పించాలి.

– మెట్ట చిన్నమ్మి, వృద్ధురాలు, గంగాధరపేట

### అవస్థలు తప్పడం లేదు




రేషన్ పంపిణీలో వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. జగన్ ప్రభుత్వంలో వలంటీర్లతో ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ప్రతినెలా ఇబ్బంది అవుతోంది. ఈనెల ఏకంగా బియ్యమే లేవంటున్నారు. మా పరిస్థితి ఏంటి.


– మామిడి మల్లమ్మ, వృద్ధురాలు, గంగాధరపేట

## కేంద్రమంత్రి సమక్షంలో బయటపడ్డ గ్రూపు తగాదాలు

సారవకోట: మండలంలోని సవర మాళువ నుంచి కాలనీ మాళువ వరకు నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో మాళువ గ్రామంలోని టీడీపీలో ఉన్న గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. ఎన్నికల ముందు ఎంపీపీ కూర్మినాయుడుతో టీడీపీలో చేరిన నక్క రామరాజు ఇంటికి కేంద్రమంత్రి వెళ్లడంతో పాత టీడీపీ వర్గీయులు తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీలేక పాత టీడీపీ వర్గీయులైన సిరిపురం అప్పలనాయుడు, మామిడి ఆనందరావుల ఇంటికి సైతం వెళ్లాల్సి వచ్చింది. వారి వారి ఇళ్ల నుంచి కేంద్రమంత్రి బయటకు వచ్చిన తర్వాత ఆ రెండు వర్గాల మధ్య వాగ్వివాదం జరగగా పోలీసులు కలగజేసుకుని విషయం పెద్దది కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన జరిగిన తర్వాత ఎంపీపీ స్వగ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి పాత టీడీపీ వర్గం హాజరు కాలేదు. అలాగే తర్లి గ్రామానికి నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి ఎంపీపీ వర్గం హాజరవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవర కురిడింగి గ్రామానికి నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి ఆ పంచాయతీకి చెందిన పీపీసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావును ఆహ్వానించకపోవడంతో ఆయన అసంతృప్తి చెందారు. కాగా పర్యటనలో భాగంగా కొండ చీపురు పంటకు మద్దతు ధర కల్పించాలని సవరమాళువ గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పంచాయతీ రాజ్ ఈఈ ఎస్.రామకృష్ణ, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ కూర్మినాయుడు, ధర్మాన తేజకుమార్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి





ప్రమాద స్థలంలో వసంత్ మృతదేహం (ఇన్‌సెట్లో) వసంత్(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం లొద్దపుట్టిలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లొద్దపుట్టి గ్రామం అంబుగాం వీధికి చెందిన పిట్ట మోహనరావు, కుమారీల కుమారుడు పిట్ట వసంత్(32) కాకినాడలో చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం తండ్రి మోహనరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ భారాన్ని మోస్తున్న వసంత్, ఈ ఏడాది మార్చి 7న ఇచ్ఛాపురం బెల్లుపడకు చెందిన సంధ్య ఉరఫ్ ఇందును వివాహం చేసుకున్నాడు. శనివారం అరకు విహార యాత్ర కోసం తన ద్విచక్ర వాహనంపై భార్య సంధ్యను తీసుకొని వెళ్తుండగా, ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంజరిగింది. ఈ ప్రమాదంలో వసంత్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతోంది. జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ సమీపంలో రొయ్యల మేత తీసుకెళ్తున్న వ్యాన్ మరమ్మతులకు గురికావడంతో నిలిపివేశారు. ఆగి ఉన్న వ్యాన్‌ను వసంతకుమార్ బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నవ దంపతులను మృత్యువు విడగొట్టిందని బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

## విజేతగా శ్రీకాకుళం సన్ రైజర్స్

శ్రీకాకుళం: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన లీప్ క్రికెట్ టోర్నమెంట్-2025 శనివారంతో ముగిసింది. ఫైనల్స్‌లో శ్రీకాకుళం సన్ రైజర్స్, కృష్ణా రాయల్స్ మధ్య మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం సన్ రైజర్స్ 20 ఓవర్లకు ఐదు వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా రాయల్స్ 20 ఓవర్లకు 148 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. విజేతలకు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ స్టేట్ సెక్రటరీ జి.భానుమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు..ఫుల్ రష్

వరుస సెలవు ప్రభావం ఆర్టీసీ బస్సులపై పడింది. ఆదివారంతో పాటు సోమవారం దీపావళి సెలవు కావడంతో ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికులు స్వగ్రామాలకు వెళ్లేందుకు బయలుదేరడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ శనివారం రద్దీగా కనిపించింది. బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బస్సు కాంప్లెక్స్‌లోకి వచ్చిన వెంటనే ఎక్కేందుకు ఎగబడ్డారు. ఇక సాయంత్రం అయినప్పటికి బస్సులు సకాలంలో రాకపోవడంతో ఎప్పటిలాగే నిరీక్షణ తప్పలేదు. –శ్రీకాకుళం అర్బన్





బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు